క్లుప్తంగా

రాజగోపుర నిర్మాణానికి విరాళం



నగదును ఈఓకు అందజేస్తున్న దాత

మద్దికెర : మండల పరిధిలోని పెరవలి గ్రామంలోని శ్రీరంగనాథస్వామి దేవాలయంలో తూర్పు, దక్షిణ రాజగోపురాల నిర్మాణానికి అనంతపురం జిల్లా నాగిరెడ్డిపల్లికి చెందిన కాసేపల్లి యల్లమ్మ, కాసేపల్లి ఆదినారాయణరెడ్డి రూ. 1.10 లక్షల విరాళం అందజేశారు. ఈ నేపథ్యంలో వారికి ఆలయ ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి అభినందించారు.దేవాలయ అభివృద్ధికి దాతలు ముందుకు రావడం హర్షించదగ్గ విషయమన్నారు.

బనగానపల్లెకు సాయిసేవక్ పాదయాత్ర



పాదయాత్రలో ఎమ్మిగనూరు సాయిసేవక్‌లు

ఎమ్మిగనూరు: ఎమ్మిగనూరు నుంచి బనగానపల్లెకు సాయిసేవక్‌లు ఆరురోజుల పాదయాత్ర చేపట్టారు. స్థానిక షిరిడీ సాయి మందిరం నుంచి శుక్రవారం 12 మంది సేవక్‌లు బయలుదేరారు. ఎమ్మిగనూరు, గోనెగండ్ల, వేముగోడు, కోడుమూరు, వెల్దుర్తి, బ్రహ్మగుండం మీదుగా బనగానపల్లెకు చేరుకొని అక్కడ 124 అడుగుల సద్గురుసాయి ద్వితీయ వార్షికోత్సవంలో పాల్గొని సేవలందిస్తామని వారు తెలిపారు. మొదటిరోజు పాదయాత్ర గోనెగండ్ల మండలం వేముగోడు వరకు సాగింది.

ఘనంగా విగ్రహ, ధ్వజ ప్రతిష్ఠ



ధ్వజస్తంభ ప్రతిష్ఠ చేస్తున్న దృశ్యం

కృష్ణగిరి: మండల పరిధిలోని మన్నెకుంట గ్రామంలోని నూతన ఆలయంలో శుక్రవారం సుంకుల పరమేశ్వరి దేవి, నందీశ్వర, గణపతి, కుమార స్వామి, పార్వతీ దేవి, లింగమయ్య దేవతా విగ్రహాలు, ధ్వజ స్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. గత మూడు రోజులుగా గ్రామస్తుల ఆధ్వర్యంలో పండితుల వేద మంత్రోచ్చారణల మధ్య సాగుతున్న ఈకార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం రాత్రి రాష్ట్రస్థాయి భజన పోటీలు జరిగాయి.

'గాలికుంటు' ప్రమాదకరం



పశువులకు టీకా వేస్తున్న దృశ్యం

హొళగుంద:పశువులకు సోకే గాలికుంటు వ్యాధి ప్రమాదకరమని,ముందుజాగ్రత్తగా వాటికి టీకాలు వేయించాలని పశు సంరక్షణ సహాయకుడు జిలాన్‌బాషా అన్నారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని మార్లమడికి, ముద్దటమాగి గ్రామాల్లో పశువులకు, గొర్రెలుకు గాలికుంట వ్యాధి నివారణ టీకాలు వేశారు. అనంతరం పశుపోషకులకు వ్యాధి లక్షణాల గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ యంకప్ప తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ



ఆలూరులో ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ అల్లబకాస్, డాక్టర్ మారుతి

సాక్షి, నెట్ వర్క్: నులిపురుగుల నివారణే లక్ష్యంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేయనున్నారు. ఈ నెల 14 నుంచి 18వ తేదీ వరకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఆలూరు, పత్తికొండ, ఎమ్మిగనూరు నియోజకవర్గాల్లో పాఠశాలల హెచ్ఎంలకు అధికారులు ఆల్బెండజోల్ మాత్రలు అందజేశారు. మధ్యాహ్న భోజనం అనంతరం 0–18 ఏళ్ల బాల బాలికలకు వాటిని అందజేసి మింగించాలని సూచించారు.

చలివేంద్రం ప్రారంభం

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని ఇంద్రానగర్‌లో కాలనీ యూత్ సభ్యులు శుక్రవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. గత తొమ్మిదేళ్లుగా వేసవిలో ప్రజల దహార్తిని తీర్చేందుకుగా చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో యూత్‌సభ్యులు ఉరుకుందు, రామాంజి, దస్తగిరి, అంజి, శ్రీను, నాగరాజు, జయరామ్ తదితరులు పాల్గొన్నారు.

గురుకులం పిలుస్తోంది

- ఐదవ తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల
- ఈ నెల 23 వరకు దరఖాస్తుల స్వీకరణ
- ఏప్రిల్ 23న ప్రవేశ పరీక్ష
- అరికెర గురుకులంలో మొత్తం 160 సీట్లు



అరికెరలోని డా.బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల

ఆలూరు రూరల్: పేద విద్యార్థులకు గురుకులం పిలుస్తోంది. ఉచిత విద్య అందించేందుకు దరఖాస్తులు కోరుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో 2023–24 విద్యాసంవత్సరం ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. కార్పొరేట్ తరహాలో విద్యనందించే ఈ విద్యా సంస్థల్లో ఐదవ తరగతి, ఇంటర్ ప్రాథమ సంవత్సరంలో ప్రవేశానికి అర్హులైన విద్యార్థులు ఈనెల 23లోపు దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుంది.ఒకసారి సీటు పొందితే వసతితో పాటు ఇంటర్మీడియేట్ వరకూ ఉచితంగా చదువుకునే అవకాశం కలుగుతుంది. ఇంగ్లిష్ బోధనతో పాటు నీట్, ఐఐటీలో ఉచితంగా శిక్షణ ఇస్తారు. విద్యార్థులు ఏప్రిల్ 23వ తేదీన జరిగే కామన్ టాలెంట్ ఎంట్రెన్స్‌లో ప్రతిభ చూపి ప్రవేశాలు పొందవచ్చు. ఆలూరు నియోజకవర్గంలో ఆలూరు మండలం అరికెర గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో ఐదవ తరగతికి 80 సీట్లు ఉన్నాయి. అలాగే జూనియర్ ఇంటర్‌లో సీఈసీ గ్రూపునకు 40 సీట్లు, ఎంఈసీ గ్రూపుకు 40 సీట్లు కేటాయించారు. ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తు చేసినప్పుడు నీట్, ఐఐటీ శిక్షణల్లో దేనిని తీసుకుంటారో ఆప్షన్ ఇవ్వాల్సి ఉంటుంది. ప్రభుత్వం నిర్వహించే కామన్ పరీక్షలకు విద్యార్థులను పంపిస్తారు. అక్కడ ప్రతిభ చూపితే రాష్ట్రస్థాయిలో ప్రతిభా పరీక్షలకు పంపుతారు.

అర్హతలు ఇవీ..

ఐదవ తరగతిలో ప్రవేశానికి ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 2010 సెప్టెంబర్ 1 నుంచి 2014 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలి. ఓసీ, బీసీ,ఎస్సీ, బీసీ–సీ, విద్యార్థులు 2012 సెప్టెంబర్ 1 నుంచి 2014 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలి. జూనియర్ ఇంటర్ ప్రవేశాలకు 2022–23 ఏడాదిలో పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్న వారు అర్హులు. వయసు 2023 ఆగస్టు 31 నాటికి 17 ఏళ్లు దాటి ఉండరాదు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం, సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు ఏడాది సడలింపు ఉంటుంది. విద్యార్థులు స్వంత జిల్లాలో 2021–22 ఏడాదిలో 3వ తరగతి, 2022–23లో 4వ తరగతి ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో చదివి ఉండాలి. ఐదు, ఇంటర్‌కు దరఖాస్తు చేసుకున్న విద్యార్థి తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.లక్ష దాటకూడదు.

దరఖాస్తు చేసే విధానం..

గురుకులంలో ప్రవేశానికి విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఐదవ తరగతికి https://apgpcet.apcfss.in వెబ్‌సైటులో వెళ్లి దరఖాస్తు చేసుకోవాలి. ఇంటర్ కోసం https://apgpcet.apcfss.in inter ద్వారా ఈ నెల 23వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు నమోదు చేసుకోవాలి. విద్యార్థులు ఎంపిక చేసుకున్న పాఠశాల/కళాశాల వివరాలు తప్పని సరిగా నమోదు చేయాలి. వివరాలు సబ్మిట్ చేసిన తర్వాత మార్చుకునే అవకాశం ఉండదు.

సద్వినియోగం చేసుకోండి



గురుకులాల్లో ఐదు, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి నోటిఫికేషన్‌ను ప్రభుత్వం విడుదల చేసింది. పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఇది చక్కని అవకాశం. ఆసక్తి గల వారు దీనిని సద్వినియోగం చేసుకోవాలి. 5వ తరగతి నుంచి ఇంటర్మీడియేట్ వరకు అన్ని సౌకర్యాలతో ఉచిత విద్య అందిస్తాం.

– శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ అంబేడ్కర్ గురుకులం ప్రిన్సిపాల్, అరికెర

సాదాసీదాగా మండల మీట్



పొజిషన్ సర్టిఫికెట్లపై వివరణ ఇస్తున్న తహసీల్దార్ రవి

తుగ్గలి : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ అనుంరాజు ఆదెమ్మ అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సాధాసీదాగా ముగిసింది. ముందుగా ఎల్లమ్మగుట్ట సర్పంచ్ ఎల్లీబీయి మృతికి రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలిపారు. అనంతరం వైద్యం, విద్యుత్ శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. సొంత స్థలాలు ఉన్నా పొజిషన్ సర్టిఫికెట్లు లేక పేదలకు పక్కా గృహాలు మంజూరు చేయడం లేదని వైస్ ఎంపీపీ ఎర్ర నాగప్ప సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. పొజిషన్ సర్టిఫికెట్లు ఇవ్వపోతే ఎలా ప్రశ్నించారు. దీనిపై తహసీల్దార్ రవి మాట్లాడుతూ నిబంధనల ప్రకారం రిజిస్ట్రేషన్ ఉన్న సొంత స్థలాలకు పొజిషన్ సర్టిఫికెట్లు అవసరం లేదన్నారు. ప్రభుత్వ స్థలాలకు మాత్రమే పొజిషన్ సర్టిఫికెట్లు ఇచ్చే వీలుందన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు పులికొండనాయక్, వైస్ ఎంపీపీ మల్లికార్జునరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించండి



మాట్లాడుతున్న పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

తుగ్గలి : ఈనెల13న నిర్వహించే ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పిలుపునిచ్చారు. శుక్రవారం ఆమె మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తుగ్గలి, జొన్నగిరి, రాతనలో పట్టభద్రులు, ఉద్యోగ, ఉపాధ్యాయులను కలిసి తమ పార్టీ బలపరిచిన వెన్నపూస రవీంద్రారెడ్డి, ఎంవీ రామచంద్రారెడ్డిలకు మొదటి ప్రాధాన్యతా ఓటు వేయాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో సర్కారు బడుల రూపురేఖలు మార్చి ప్రతి పేదవాడు ఉన్నత చదువులు చదువుకునేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాసట కల్పించారన్నారు. గ్రామ సచివాలయాల ఏర్పాటుతో ఒకేసారి 1.30 లక్షల సచివాలయ ఉద్యోగాలు కల్పించి చరిత్ర సృష్టించారన్నారు. ఇటీవల విశాఖపట్నంలో నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్‌లో రూ.13.41 లక్షల కోట్ల పెట్టుబడులతో 6.09 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించేందుకు ప్రభుత్వం పారిశ్రామికవేత్తలతో ఒప్పందాలు కుదుర్చుకుందన్నారు. రాష్ట్రాన్ని అన్ని విధాల అభివృద్ధి పథంలో తీసుకెళుతున్న సీఎం వైఎస్ జగన్‌కు అండగా నిలబడాలని కోరారు. అనంతరం తుగ్గలిలో ఎంపీటీసీ సభ్యులతో సమావేశం నిర్వహించి స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ మధుసూధన్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యుడు రామచంద్రారెడ్డి, మండల కన్వీనర్ జిట్టా నాగేష్, సచివాలయ మండల కన్వీనర్ హనుమంతు, జెడ్పీటీసీ సభ్యుడు పులికొండ నాయక్, వైస్ ఎంపీపీలు మల్లికార్జునరెడ్డి, నాగప్ప, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయ కన్వీనర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పత్తికొండ టౌన్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి నియోజకవర్గంలో విస్తత ప్రచారం నిర్వహిస్తున్నారు. శుక్రవారం పత్తికొండ మండల కేంద్రంలోని జెడ్పీ బాలురు, బాలికల హైస్కూళ్లు, అంబేడ్కర్ ఎస్సీ గురుకులం, కేజీబీవీ, ప్రభుత్వ జూనియర్ కాలేజీ, మోడల్ స్కూళ్లలో ఓటర్లతో సమావేశమయ్యారు.

బడుగు, బలహీన వర్గాలకు ప్రాధాన్యం

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో మధుసూదన్‌ను గెలిపించండి
- స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్‌ఆర్‌సీపీ అభ్యర్థి అలంపూర్ మధుసూదన్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని బాబుఫంక్షన్ హాల్‌లో మున్సిపల్ కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలతో సమావేశం నిర్వహించారు. అభ్యర్థి మధుసూదన్, పార్టీ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్న ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ బడుగు, బలహీన వర్గాలను సామాజికంగా, రాజకీయంగా ఎదిగేందుకు ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. అందులో భాగంగానే కర్నూలు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ వైఎస్‌ఆర్‌సీపీ అభ్యర్థిగా మధుసూదన్‌ను ఎంపిక చేశారన్నారు. ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ మొదటి ప్రాధాన్యత ఓటు ఆయనకే వేసి గెలిపించాలని కోరారు. సీఎం వైఎస్ జగన్‌తోనే బీసీలకు తగిన గుర్తింపు లభించిందని ఎమ్మెల్సీ అభ్యర్థి ఎ. మధుసూదన్ పేర్కొన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు, వైఎస్‌ఆర్‌సీపీ మండల కన్వీనర్ బీఆర్ బసిరెడ్డి, ఎమ్మిగనూరు, గోనెగండ్ల, నందవరం ఎంపీపీలు కేశన్న, నసురుద్దీన్, లక్ష్మీదేవమ్మ, మున్సిపల్ వైస్ చైర్మన్లు నజీర్ అహమ్మద్, దివ్యకళ, పార్టీ పట్టణ అధ్యక్షుడు బుట్టారంగయ్య, అధికార ప్రతినిధి సునీల్‌కుమార్, టౌన్ బ్యాంక్ చైర్మన్ యూకే రాజశేఖర్, జిల్లా వక్ఫ్‌బోర్డు ఉపాధ్యక్షుడు రియాజ్ అహమ్మద్, జేసీఎస్ కన్వీనర్లు షబ్బీర్ అహమ్మద్, బంగిశ్రీరాం, వైఎస్‌ఆర్‌సీపీ సీనియర్ నాయకులు లక్ష్మీకాంతరెడ్డి, శివప్పగౌడ్, బందెవవాజ్, ఆయా మండలాల జెడ్పీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

ఒంటరిగా పోరాడలేక ఒప్పందం

ఆలూరు: ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఒంటరిగా పోరాడలేక టీడీపీ.. వామ పక్ష పార్టీలతో ఒప్పందం చేసుకుందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆలూరు నియోజకవర్గ పరిశీలకుడు మల్కిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి అన్నారు. మండల కేంద్రం ఆలూరులో శుక్రవారం పార్టీ మండల కన్వీనర్ వీరేష్‌తో కలిసి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టభద్రులు, ఉపాధ్యాయ, స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులు వెన్నపూస రవీంద్రారెడ్డి, ఎంవీ రామచంద్రారెడ్డి, డాక్టర్ బోయ మధుసూదన్ ను గెలిపించాని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జ్ రాజా రెడ్డి, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మద్దికెర : పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నుపూస రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రారెడ్డిని గెలిపించాలని జెడ్పీటీసీ మురళీధర్ రెడ్డి శుక్రవారం మండల కేంద్రం మద్దికెరలో ప్రచారం నిర్వహించారు.కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శాంతన్న, మాజీ ఎంపీపీ మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

చిప్పగిరి: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులకు మద్దతుగా చిప్పగిరి జెడ్పీటీసీ విరుపాక్షి మండలంలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాల పరిశీలన

వెల్దుర్తి: బొమ్మిరెడ్డిపల్లెలో ప్రభుత్వ సహకారంతో పూర్తయిన వ్యక్తిగత ఇళ్ల నిర్మాణాలను ఎంపీడీఓ శ్రీనివాసరావ్ శుక్రవారం పరిశీలించారు. పేదలందరికీ గూడు నిర్మించి ఇచ్చేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం గ్రామ సచివాలయం తనిఖీ చేసి రికార్డులు, హాజరు పరిశీలించారు. ప్రతి రోజు సాయంత్రం రెండు గంటల పాటు స్పందన కార్యక్రమం నిర్వహించాలని సచివాలయ ఉద్యోగులకు సూచించారు.

ఓటరు స్లిప్‌ల పంపిణీ

ఆస్పరి: మండలంలో ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్లకు ఓటరు స్లిప్పులు పంపిణీ చేసినట్లు తహశీల్దార్ కుమారస్వామి శుక్రవారం తెలిపారు. మండలంలో పట్టుభద్రుల ఓటర్లు 1,126 ఉండగా ఇప్పటికి 1,119 మందికి, ఉపాధ్యాయులు 20 మందికి స్లిప్పులు అందజేశామన్నారు. 13న జరిగే ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

నందవరం : ఈ నెల 13వ తేదీన జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామని తహసీల్దార్ నిత్యానందరాజు తెలిపారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలు జరిగే రోజు కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలు చేస్తామన్నారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు తదితర వసతులను ఏర్పాటు చేశామన్నారు.

'పది' విద్యార్థులకు మోడల్ టెస్ట్

గోనెగండ్ల: మండల కేంద్రం గోనెగండ్లలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో శుక్రవారం ఎస్‌ఎఫ్ఐ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు మోడల్ పరీక్ష నిర్వహించారు. ఆ విద్యార్థి సంఘం నాయకులు వీరన్న, ఖాజా మాట్లాడుతూ మోడల్ పరీక్షల ద్వారా విద్యార్థులకు మెయిన్ పరీక్షలపై ఉన్న భయంపోతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

గోనెగండ్ల: పదవ తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సూచించారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో ఎంఈఓ వినోద్ కుమార్, హైస్కూళ్ల హెచ్ఎంలతో పదవ తరగతి పరీక్షలపై సమావేశం నిర్వహించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు.

పంచాయతీ కార్యాలయాల తనిఖీ

వెల్దుర్తి: వెల్దురి, రత్నపల్లె పంచాయతీ కార్యాలయాలను శుక్రవారం డీఎల్‌పీఓ తిమ్మక్క తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి పన్ను వసూళ్లు ఈనెల 15 లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. స్థానిక పంచాయతీలో సచివాలయ ఏఎన్ఎంలు, ఆరోగ్య కార్యకర్తలతో సమావేశమై చిన్నారుల్లో నులి పురుగుల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు.

ఉద్యోగుల సమస్యలు తీర్చాలి

నందవరం : రెవెన్యూ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఏపీజేఏసీ అమరావతి పిలుపు మేరకు శుక్రవారం స్థానిక ఉద్యోగులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో డీటీ రాఘవేంద్ర, సర్వే డీటీ అధికారిణి అమీనా బేగం తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన

చిప్పగిరి: మండలంలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను శుక్రవారం తహసీల్దారు లక్ష్మీనారాయణ,ఎస్ఐ మల్లికార్జున, ఎంపీడీఓ సుధాకర్ రాజు పరిశీలించారు. జిల్లా పరిషత్ హైస్కూల్‌లో వేర్వేరుగా ఎ, బి బ్లాక్‌లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

వెల్దుర్తి: విద్యుత్ లైన్ల అభివృద్ధి పనుల్లో భాగంగా అల్లుగుండు, బొమ్మిరెడ్డిపల్లె, మల్లెపల్లె, నార్లాపురంలలో శనివారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ రాఘవేంద్రరెడ్డి తెలిపారు. ఆయా గ్రామాల పరిధిలో వ్యవసాయ విద్యుత్ ఉదయం 3 గంటల నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 5 గంటల నుంచి 6 గంటల వరకు ఉంటుందన్నారు. వినియోగదారులు, రైతులు గమనించి సహకరించాలని ఏఈ కోరారు.

దళితులకు భూములివ్వాలి

హొళగుంద: మండలంలో నివసించే భూమిలేని నిరుపేద దళితులకు ప్రభుత్వ భూములు ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. ఈ మేరకు వారు శుక్రవారం దళితులతో కలిసి హొళగుంద తహసీల్దారు కార్యాలయం ఎదుట ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. చాలామంది దళితులు భూములు లేక కూలీలకు జీవనం సాగిస్తున్నారని, వారిని ఆదుకోవాలని తహసీల్దారు హుసేన్‌సాహెబ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు వెంకటేష్, నాయకులు దుర్గాప్రసాద్, వీరేశ్, మంగన్న తదితరులు పాల్గొన్నారు.

అక్షర గేయాలు పుస్తకావిష్కరణ

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని సిద్దార్థ డిగ్రీ కళాశాలలో శుక్రవారం రాత్రి బాలసాహిత్య వేత్త అయిన రచయిత గద్వాల సోమన్న రచించిన అక్షర గేయాల పుస్తకాన్ని డాక్టర్ బ్రహ్మారెడ్డి నేతృత్వంలో పలువురు ఆవిష్కరించారు.రచయిత గద్వాల సోమన్న, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు ప్రభుదాస్, ఉపాధ్యాయులు కుముద్వతి, నాగేశ్వరావు, పాటిల్ ఈశ్వర్‌రెడ్డి, రిటైర్డ్ ఏఎస్‌డబ్ల్యూఓ ఆనంద్, డాక్టర్ బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్


96 మద్యం బాటిళ్ల స్వాధీనం

పత్తికొండ రూరల్ : స్థానిక అంజనేయనగర్‌లో నాగరాజు అనే వ్యక్తి అక్రమంగా నిల్వ ఉంచి విక్రయిస్తున్న 96 మద్యం బాటిళ్లను పోలీసులు పట్టుకున్నారు. అనుమానం రాకుండా ఒక తెల్లటి సూపర్‌సంచిలో వేసుకుని స్కూటర్‌పై పెట్టుకుని అమ్ముతున్నాడు. నిఘావేసిన పోలీసులు శుక్రవారం దాడి చేసి పట్టుకున్నారు. మద్యం బాటిళ్లను, బైక్‌ను సీజ్ చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ మురళీమోహన్ తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఎండుగడ్డి ట్రాక్టర్ బోల్తా

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని దూదేకొండ గ్రామ సమీపంలో శుక్రవారం ఎండుగడ్డిని తరలిస్తున్న ట్రాక్టర్ బోల్తా పడింది. చక్రాళ్ల గ్రామానికి చెందిన ఓ రైతు మేతను ట్రాక్టర్‌లో తరలిస్తుండగా ప్రధాన రోడ్డులో అదుపుతప్పి బోల్తా పడింది. ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు సమాయత్తం



హాలహర్వి జెడ్పీ హైస్కూల్‌లో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న పత్తికొండ ఆర్డీఓ మోహన్‌దాస్ (ఫైల్)

ఆలూరు: ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు అధికారులు సర్వం సిద్ధం చేస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 13న ఎన్నికలు జరగనుండటంతో ఉన్నతాధికారులు పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి స్థానిక అధికారులకు నిర్వహణపై సలహాలు, సూచనలు చేస్తున్నారు.

పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల వివరాలు, పోలింగ్ కేంద్రాలు

నియోజకవర్గం	పట్టభద్రులు	ఉపాధ్యాయులు	పోలింగ్‌కేంద్రాలు
ఆలూరు	4,791	129	6,
పత్తికొండ	6,475	327	6,
ఎమ్మిగనూరు	8,000	667	7
మొత్తం	19,264	1,123	19

శ్రమజీవులకు ఆసరా !



ఎమ్మిగనూరులో భవన నిర్మాణ పనులు చేస్తున్న కార్మికులు

- అసంఘటిత కార్మికులకు పెన్షన్ పథకం
- 18నుంచి 40 సంవత్సరాల వయస్సు వారికి వర్తింపు
- ఎమ్మిగనూరులో 5,748 మంది గుర్తింపు

ఎమ్మిగనూరు: అసంఘటిత కార్మికులు, చిరువ్యాపారుల కోసం కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయి. ఇటీల ప్రభుత్వ ఉద్యోగుల్లా వీరు కూడా నెలనెలా పెన్షన్ పొందేందుకు 'ప్రధానమంత్రి శ్రమయోగి మాన్‌ధన్ జనయోజన 'పథకాన్ని ప్రవేశపెట్టాయి. ఈ పథకంలో చేరిన కార్మికులు ఎంతమేరా ప్రీమియం చెల్లిస్తే అంతమేర కేంద్రప్రభుత్వం అదనంగా జమచేస్తోంది. 60 సంవత్సరాల తరువాత నెలనెలా కార్మికుడి బ్యాంక్ ఖాతాకు పెన్షన్ సొమ్ము జమ అవుతుంది. అసంఘటిత కార్మికులతోపాటు చిరువ్యాపారుల్లో ఈ పెన్షన్ పథకం ఆశలు రేకెత్తిస్తోంది. ఎమ్మిగనూరు నియోజకవర్గంలో ఈ పథకానికి 5,748 మంది భవన నిర్మాణ కార్మికులు దరఖాస్తు చేసుకున్నారు.

అర్హతలు ఇలా..

ప్రధానమంత్రి శ్రమయోగి పెన్షన్ పథకానికి 18 నుంచి 40 సంవత్సరాల వయస్సు ఉండాలి. నెలకు రూ.15వేలలోపు ఆదాయం కలిగి ఉండాలి. ఇళ్లల్లో పనిచేసేవారు, రిక్షా కార్మికులు, వడ్డెర కూలీలు, వ్యవసాయ, పారిశుధ్య కార్మికులు, బీడికార్మికులు, ప్లంబింగ్, బైండింగ్, కమ్మర, కుమ్మరి, స్వర్ణకారులు, రజకులు, క్షౌరదారులు, బ్యూటీపార్లర్లు, వీధి వ్యాపారులు, ఆటోకార్మికులు, టైలర్లు, హమాలీలు, హోటళ్లు,సినిమా హాళ్లలో పనిచేసేవారు, ఇటుకల బట్టీల్లో పనిచేసేవారు, చేనేత, చర్మకారులు, ప్రైవేటు స్కూళ్లలో పనిచేసే కార్మికులు, మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు, ఎలక్ట్రీషియన్లు తదితరులు.అయితే, ఎటువంటి ఇతర పెన్షన్ స్కీంల్లో సభ్యులు కానివారు, ఆదాయపన్ను చెల్లించని వారే శ్రమయోగి పెన్షన్ పథకానికి అర్హులు. సేవామిత్ర ద్వారాగానీ,ఆన్‌లైన్ ద్వారా గానీ అర్హులు దరఖాస్తు చేసుకోవచ్చు. వయస్సును బట్టి నెలనెలా రూ.55 నుంచి 200 వరకు ప్రీమియం చెల్లించాలి.

కావాల్సిన డాక్యుమెంట్లు

ఆధార్‌కార్డు, వయస్సు ధ్రువీకరణ, చేస్తున్న పని ధ్రువీకరణ, ప్రస్తుతం వాడుతున్న మొబైల్ నంబరు

పథకం ద్వారా ప్రయోజనాలు

- ఈ పథకంలో ప్రీమియం చెల్లించేవారికి 60 యేళ్ల తరువాత నెలనెలా రూ.3 వేలు పెన్షన్
- పెన్షన్‌దారులు మరణిస్తే అందులో 50 శాతం నెల నెల వారి నామినీకి జీవితకాలం వరకు అందజేస్తారు.
- ప్రీమియం చెల్లిస్తూ మధ్యలోనే మరణిస్తే వారి నామినీలు ప్రీమియం చెల్లిస్తూ పూర్తి సభ్యులుగా కొనసాగవచ్చు.
- వృద్ధాప్య, వితంతు, వికలాంగుల పెన్షన్‌దారులు కూడా ఈ పెన్షన్‌ను పొందవచ్చు.

ఈ–శ్రమతో ఎన్నో ప్రయోజనాలు

రాష్ట్ర కార్మిక సంక్షేమశాఖ ఈ–శ్రమ ద్వారా పలు సంక్షేమ పథకాలను కార్మికులకు అందిస్తోంది. కార్మికులకు రూ.5 లక్షల ప్రమాదబీమా, సహజ మరణాలకు రూ.60 వేలు ఇస్తుంది, మహిళా కార్మికులకు ప్రసూతి సాయం కింద రూ.20 వేలు, కార్మికుల పిల్లలకు విద్య, వైద్యానికి ప్రత్యేక సహాయాలు, వివాహ కానుకలు అందజేస్తుంది. గుర్తింపుకార్డు పొందిన కార్మికులు మరణిస్తే మట్టి ఖర్చులకు రూ.20వేలు ఇస్తారు.

పథకాన్ని సద్వినియోగం చేసుకోండి



అసంఘటిత కార్మికులు, వ్యాపారులను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి శ్రమయోగి మాన్‌ధన్ యోజన పథకాన్ని అమలులోకి తెచ్చింది. 18 నుంచి 40 యేళ్ల వయస్సు ఉన్న ఉన్న కార్మికులందరూ ఈ పథకానికి అర్హులు.

– శారద, కార్మిక సంక్షేమశాఖ అధికారిణి, ఎమ్మిగనూరు